# 4. ఎదురు తిరుగని ఆదర్శం

రామారావుగారు మహా హడావిడిగా ఉన్నారు. ఇంట్లో లోపలకు బయటకు కాలుగాలిన పిల్లి లా తిరుగుతున్నాడు. పని తొందరగా తెమలనియ్యండని తొందరపెడ్తున్నాడు. పాలేర్లను కేక వేసి ఎడ్లు బండి బస్సు దగ్గరకు పంపడానికి తయారుగా ఉంచమని పురమాయిస్తున్నాడు. కూతురు దగ్గరకు పోయి సంతోషంగా ఉండమని త్వరగా తయారు కమ్మని ఆదేశాలిస్తున్నాడు. భార్యను సమీపించి వంటపనులు త్వరగా ముగించమని వేగిరపెడ్తున్నాడు. అతనికి ఏమవుతుందోనన్న ఆందోళనగాను, పిల్లవాడు వస్తున్నందుకు సంతోషంగాను, సంబంధం కుదరగలదన్న ఆశగానూ ఉన్నది.

లక్ష్మమ్మకు వచ్చేవాళ్ళను సంతృప్తిపరచాలన్న ఆరాటముంది. అందుకై రకరకాల పిండివంటలు, చికెన్ ఫ్రై తయారు చేయడంలో తలమున్కలై యున్నది. ఎలాగైనా ఈ సంబంధం కుదిరితే అదే పదివేలని ఆమె యోచిస్తున్నది. వియ్యాలవారిని ఎలాగైనా సంతృప్తిపరచాలని ఆమె ఇంటిని నానా విధాలుగా అలంకరణలతో ముంచివేస్తున్నది. శేఖర్‌కు ఈ పెండ్లిచూపుల తతంగమంతా పరమ జోరుగా తోస్తుంది. ఇంకా సాంప్రదాయాలను, ఆచారాలను పట్టుక వ్రేలాడుతూ చెల్లిని పెళ్ళిచూపుల పేరిట మానసిక వేదనకు గురిచేస్తున్నారన్న బాధ వుంది. ఏమైతే అదవుతుందన్న నిర్లక్ష్యం ఉంది. పసి హృదయంగల రమకు మాత్రం అక్కకు పెళ్ళిచూపులంటే

మహా సంబరంగా ఉంది. పెళ్ళిచూపుల పేరిట తయారయ్యే పిండివంటలు హాయిగా తినవచ్చని, ఆరోజు బడికి ఎగనామం పెట్టవచ్చని ఆమె సంతోషిస్తోంది. కొత్త లంగా జాకెట్ వేసు కొని మాటిమాటికి అక్క గదిలోకి తొంగిచూస్తూ ఆమె ముభా వంగా ఉండటం చూసి మాట్లాడించే ధైర్యంలేక తిరిగివస్తు న్నది. ఇంట్లో అందరింత హడావిడిగా ఉంటే అక్కెందుకు బెల్లంకొట్టిన రాయిలా ముభావంగా ఉందో ఆ పసి హృద యానికెంత ఆలోచించినా అర్థంకావడం లేదు.

రాజేశ్వరికి మాత్రం ఈ తతంగమంతా ఎబ్బెట్టుగా తోస్తుంది. ఆమె ముఖంలో సంతోషం లేదు; ఉత్సాహం లేదు. ఒకవిధమైన నిర్లిప్తత. ఇది మామూలే అన భావం ద్యోతక మౌతుంది. ప్రతిసారీ తననొక ప్రాణం లేని బొమ్మలా అలం కరించి కూర్చోబెట్టడం వాళ్ళ శల్య పరీక్షలకు గురికావడం, యక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పడం అవమానంగా భావి స్తుంది. తతంగమంతా జరిగిన తర్వాత టిఫిన్, టీలు, భోజ నాలు ముగించి, తర్వాత చెప్తానని వెళ్ళిపోవడం, వారం రోజుల తర్వాత ఉత్తరం రావడం, ఆ ఉత్తరంలో పిల్ల నచ్చ లేదనో, పొడవు సరిపోదనో, అన్నీ నచ్చితే కట్నం సరిపో దనో వ్రాయడం, తల్లి దండ్రులు- తాను కుంగిపోవడం మామూలు విషయమైంది. దాని ప్రారబ్ధం- దానికి బాకివున్న ప్పుడదే సంబంధం కుదురుతుందని అమ్మానాన్నలు వేదాంత ధోరణితో మాట్లాడటం_ అందుకే ఈ పెళ్లిచూపులంటే

ఆమెకు అసహ్యంగా తోస్తున్నది. అయినా తల్లిదండ్రుల బలవంతంపై తయారవడం, వాళ్ళముందు దోషిలా కూర్చోవడం తప్పడంలేదు. అందుకే ఇంకొక గంటలో పెళ్ళిచూపులకు వస్తున్నారని తెలిసినా ఆమె ఏమాత్రం ఉత్సాహం చూపకుండా చాలా మామూలుగా పత్రిక చదువుకుంటూ మంచంపై కూర్చున్నది.

ఇంతలో రామారావుగారు "శేఖర్, బస్సొచ్చే టైమైంది. పాలేరుతో బండి కట్టించుకొని బస్సుస్టాండుకుపోయి వాళ్లను తీసుకురా" అని కొడుకును కేకవేశాడు.

"అలాగే నాన్నా" అని శేఖర్ బండి గట్టించుకొని సమీప గ్రామపు బస్సుస్టాండుకు పోయాడు.

"ఏమోయ్ వాళ్ళొచ్చే టైమౌతుంది. పనులింకా పూర్తి కాలేదా? త్వరగా అమ్మాయిని తయారుచెయ్యి" అని లక్ష్మమ్మను కేకవేసాడు.

"ఆఁ ఆఁ! వంటయిపోయింది-" అని చేతులు తుడుచుకుంటూ బయటకు వచ్చి "అమ్మాయిని తయారు చేస్తాను" అని రాజేశ్వరి గదిలోకి ప్రవేశించింది. మంచంలో పడుకొని పుస్తకం చదువుకొంటున్న కూతుర్నిచూసి "నీ కెన్నిసార్లు చెప్పాలమ్మా- అవతల నాన్నగారు తొందరచేస్తున్నారు. వాళ్లు వచ్చే వేళయింది. ఇంకెప్పుడు తయారవుతావు?" అని కూతురు చేతిలోని నవల ఒక మూలకు విసిరేసి ఆమెను ముస్తాబు చేయసాగింది.

ఇలా ఏడుపుముఖంతో నీకేం పట్టనట్లు కూర్చొనుంటే ఎట్లనమ్మా? ఇలాచేస్తే కుదిరినట్టే సంబంధం— కొంచెం హుషారుగా ఉండు" అంది.

అయినా రాజేశ్వరిలో మార్పురాలేదు. తప్పదన్నట్టుగా తల్లి బలవంతంమీద ముస్తాబు కాసాగింది. నలుపురూపులో నున్న రాజేశ్వరి ఏమంత అందగత్తె కాదు. కాని కురూపి మాత్రం కాదు. కాని ఆమె మనసు నవ్య నవనీత సమానం. ఆమె హృదయ సౌందర్యాన్ని చూడడానికి బదులు ఆమెను గులాబికలర్ అమెరికన్ జార్జెట్ చీర, అదేకలర్ జాకెట్ ధరింపజేసి, మెడలో ఒంటిపేట గొలుసువేసి, శారీరకంగా ముస్తాబు చేసారు. ఇంతలో రమ గబగబ పరుగెత్తుకుంటూ వచ్చి "అమ్మా! బండి వచ్చేసిందే" అని కేకవేసి తుర్రున బయటకు పరుగెత్తింది.

రామారావు పెళ్ళికొడుకు రఘురామారావును, అతని మిత్రుడు రాజాను సాదరంగా ఆహ్వానించాడు. చాలాసార్లు ఊరివాళ్ళను పిలిచి పెళ్లి కుదురక అవమానం పొందారు. కాబట్టి ఈసారి పెళ్ళిచూపులప్పుడు ఎవరినీ పిలువలేదు. పెళ్ళి కుదిరితే అప్పుడు చెప్పొచ్చులే అని ఊర్కొన్నారు. రఘు, రాజ సోఫాలో కూర్చున్నారు. శేఖర్ ఒక ప్రక్క కుర్చీలో కూర్చున్నాడు. అతని ప్రక్కనే రమ కూర్చొని రఘువైపు, రాజావైపు వింతగా చూస్తున్నది. ఇదివరకు వచ్చినవాళ్ళవలె వీళ్ళు దర్పంతో, ఆడంబరంగా కనబడటంలేదు. వీళ్ళు చాలా

మామూలుగా ఉన్నారు.

'ఏం బాబూ! మీకెవరు పెద్దవాళ్ళులేరా?' అన్నాడు రామారావుగారు.

'లేరండీ! నాకు నాన్నమ్మ తప్ప నా అనేవాళ్ళెవరూ లేరు. ఊళ్ళో కొంత ఆస్తిపాస్తులున్నాయి-' అన్నాడు రఘు వినయంగా. ఇంతలో రామారావుగారు "ఏమోయ్, అమ్మాయిని తీసుకురా" అన్నాడు. లక్ష్మమ్మ అమ్మాయిని తీసుక వచ్చి రఘు కెదురుగా నేలపై కూర్చోబెట్టబోయింది.

రఘు 'ఏంటుండీ, ఆమెనలా క్రింద కూర్చోబెడతా రెందుకు? మంచంపై కూర్చోబెట్టండి-' అన్నాడు.

'ఫరవాలేదులే బాబు- కూర్చోనివ్వండి' అని రామారావుగారు అమ్మాయిని నేలపైన్నే కూర్చోమన్నాడు. కాని రఘు సమ్మతించలేదు.

'నో-నో- ఆమెనలా మంచంపైనే కూర్చోబెట్టం'డన్నాడు

"మావాడు పట్టిన పట్టు వదలడండీ" అని రాజా అన్నాడు. తుదకామె మంచంపట్టెపై తల వంచుకొని కూర్చున్నది. కొంచెంసేపయిన తర్వాత రామారావుగారు 'బాబూ! అమ్మాయి నేమయినా ప్రశ్నిస్తారా?' అన్నాడు.

'అక్కర్లేదండీ! నా కిలాంటివంటే నచ్చవు. మా రాజా బలవంతంపై పెళ్ళిచూపులకొచ్చాను. మీ అమ్మాయి నిదివరకొక పెళ్ళిలో చూసాను. ఆమె మాటలు విన్నాను. ఆమె సంస్కారాన్ని, హృదయ సౌందర్యాన్ని తెలుసుకున్నాను.

బాహ్య సౌందర్యానికంటే హృదయ సౌందర్యానికే నేనె క్కువ విలువనిస్తాను. మీ అమ్మాయి నా కన్ని విధాలుగా నచ్చింది-' అన్నాడు.

రాజేశ్వరి తలయెత్తి రఘువైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. ఆమె ముఖంలో చెప్పలేని సంతోషం, ఆమె మనసు పురివిప్పిన నెమలిలా నాట్యమాడుతోంది. ఒక్క ప్రశ్నకూడా వెయ్యకుండానే కట్న కానుకల విషయం చర్చించకుండానే నచ్చిందన్న యువకుని ఇతన్నొక్కన్నే చూసింది. ప్రతి వారూ లక్షాతొంబై ప్రశ్నలతో విసిగించి, ఆడదాని కొక వ్యక్తిత్వం ఉంటుందన్న విషయంకూడా మరచి, ఆటబొ మ్మలా అటుఇటు నడిపించి, నానా విధాలుగా అవమానించి బేరసారాలాడి తర్వాత ఉత్తరం వ్రాస్తామన్న వారేగాని ఇలా ఒక్క ప్రశ్నకూడా వెయ్యకుండా నచ్చిందన్న మగవాడు లేడు. రఘు మాటలామె మనస్సుపై పన్నీటి జల్లులా వర్షిం చాయి. ఆమె అతనికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుంది. పురుషాధిపత్యం చెలాయించే ఈ కాలంలో తనను క్రింద కూర్చోనీయని అతని సహృదయతకు జోహారు లర్పించింది. ఆతడు తనను పెళ్లాడుతాననడం తన అదృష్టంగా భావి స్తుంది. ఆలోచనలతో మనసులో రఘుకు కృతజ్ఞతలు తెలుపు కుంటున్న రాజేశ్వరినుద్దేశించి రామారావుగారు 'నీకబ్బాయి నచ్చాడా తల్లీ?' అని ప్రశ్నించాడు. రాజేశ్వరి తలవంచు కొని 'నచ్చాడు నాన్నా' అని లోపలికి వెళ్ళిపోయింది.

లక్ష్మమ్మ మహా సంబరంగా టిఫిన్ తెచ్చింది. టీ ముగించిన తర్వాత అందరూ ముందుహాల్లో కూర్చున్నారు.

'అమ్మాయి నచ్చినందుకు సంతోషం. కట్నాలు, కానుకల విషయం మాట్లాడుకొందాం' అన్నాడు రాంరావు.

"రామారావుగారూ! నాకొన్ని ఆదర్శాలు, ఆశయా లున్నాయి. ఎట్టి పరిస్థితిలోనూ వాటికి తిలోదకాలివ్వడం నేను సహించను. పరాయి సొమ్ము నాశించడం నాదృష్టిలో పరమహేయం. నాకు పైసా కట్నం అక్కరలేదు. అందుకై కట్నం మాట మరచిపొండి-" అన్నాడు రఘు వినయంగా.

"అట్లంటే ఎలా బాబూ! మా కోర్కెలుకూడా తీరాలి కదా! కట్నం తీసికోకున్నా మా శక్తికొద్దీ నగలు, కాను కలరూపంగా అమ్మాయిపై పెట్టుకుంటాం. దీనికి మీరభ్యంతరం చెప్పకూడదు' అన్నాడు రాంరావుగారు.

'లేదండీ! నాకిలాంటివి ఇష్టంలేదు. ఏ రూపంలో పెట్టినా ఒక్కటే. కానుకలు, లాంచనాల మాటెత్తకండి-' అన్నాడు రఘు.

ఈమాటనేసరికి రాంరావుగారి ముఖం చిన్నబోయింది. ఏమివ్వకుండా పెళ్ళిచేస్తే తనకు తలవంపులుకాదా? ఈ పేరు మీద ఈ సంబంధాన్ని వదలుకోకూడదు. అయిదారేళ్ళగా ఎంత తిరిగినా సంబంధం కుదరడంలేదు. నల్లగా ఉందనీ, కట్నం సరిపోదనీ, ఎవరూ చేసుకోవడంలేదు. పెళ్ళైన తర్వాత ఏదోవిధంగా పెట్టుకోవచ్చని నిర్ణయించుకొని 'సరే

గాని బాబూ! పెళ్ళి ఎలా జరపాలని మీ ఉద్దేశ్యం ?'

"రామారావుగారూ! అర్థంలేని సాంప్రదాయాలతో, ఆచారాలపేరిట అపరిమితమైన ఖర్చుతో జరిపే పెళ్ళిళ్ళంటే నాకిష్టంలేదు. సింపుల్‌గా దండలు మార్చుకొని, నలుగురు మిత్రులు, బంధువులకు టీపార్టీ ఇస్తే చాలు. హోదాను చాటుకోవడానికై అనవసర ఖర్చులకులోనై చివరకు అప్పుల పాలై బాధపడేకంటే ఇలా సింపుల్‌గా చేయడమంటేనే నాకిష్టం" అన్నాడు.

ఈ మాటలకు మరీ విస్తుపోయారు రాంరావుగారు. రఘు మాటల కెంతో ముగ్ధుడయ్యాడు శేఖర్.

"బాబూ, రఘూ! దిక్కులేనివాళ్ళు చేసుకున్నట్లు ఇదేం పెళ్ళి? ఆచారాలు, సాంప్రదాయాలు ఉట్టిగనే పుట్టినవా? ఇవన్నీ కాదని పెళ్లిచేస్తే సంఘంలో మన విలువేముంటుంది!" అన్నారు రామారావుగారు.

"రావుగారూ! బాజా భజంత్రీలతో నానా ఆర్భాటాలతో చేస్తేనే పెళ్ళవుతుందా? ఒకరినొకరు అర్థంచేసికొని దండలు మార్చుకుంటే అది పెళ్లికాదా? ఎంతమం దిప్పుడు ఇలాంటి పెళ్లిళ్లు చేసుకోవడంలేదు" అన్నాడు రఘు.

రఘు మాట లాతనికి మింగుడుపడలేదు. అతన్ని సంప్రదాయపు పెళ్లి కొప్పించడానికి ఎన్నో విధాలుగా బ్రతిమిలాడాడు.

'మీరు బలవంతం చేస్తున్నారు కాబట్టి చెప్పుతున్నాను-

చివరకు రిజిష్టర్ మ్యారేజికైతే ఒప్పుకుంటాను. అంతకంటే దిగజారడం నావల్ల కానిపని" అన్నాడు రఘు.

"నరేబాబూ! మీరు ఎం. ఏ. పాసయ్యారుకదా- తర్వాత ఏంచేద్దామని మీ ఉద్దేశ్యం"" అన్నాడు రామారావు.

"రావుగారూ! నేనొక ధ్యేయంతో ఎం. ఏ. చేసాను. నాకు టీచింగ్ ప్రొఫెషన్అంటే చాలా యిష్టం. నేను బి. ఇడి. చేసి ఉపాధ్యాయుడిగా చేరుతాను" అన్నాడు.

"ప్రథమ శ్రేణిలో పాసయిన మీరు ఉపాధ్యాయ వృత్తి చేయాల్సిన ఖర్మేంపట్టింది? బ్రతుకలేనివాళ్ళు ఖడిపం తులన్నట్లు- ఆ వృత్తిలో ఏముంది? అందులో అభివృద్ధి అవ కాశాలేం ఉండవు. మీరొప్పుకుంటే ఎక్సైజు ఇన్స్పెక్టర్‌గా గాని, ఎస్. ఐ. గాగాని అప్పాయింటుమెంటు తెప్పిస్తాను-"

"రావుగారూ! నేను మొదటే చెప్పాను. నాకు కొన్ని ఆశయాలు, ఆదర్శాలు వున్నవని. ఇతరుల పలుకుబడితో వచ్చే ఉద్యోగం నేనెప్పుడూ చేయను. అస్తవ్యస్తంగా నున్న విద్యారంగంలో నాకు సాధ్యమైనంత సేవ చేయాలని, చిన్నా రుల జీవితాలకు మంచి మార్గం చూపెడుతూ, ఉత్తమ భారత పౌరులుగా తీర్చిదిద్దాలని నా ధ్యేయం. ఉపాధ్యాయుడే దేశా నికి వెలుగు. ఒక ఉత్తమ ఉపాధ్యాయుడు ఎంతోమంది విద్యా ర్థులకు వెలుగు చూపెట్టగలుగుతాడు" అన్నాడు రఘు ఆవేశంగా.

'ఆశయాలు, ఆదర్శాలంటూ మడిగట్టుక కూర్చుంటే అధోగతి పాలౌతారు. ఉపాధ్యాయ వృత్తిలో మిగిలేది చివ

ర్థకు చిన్నతప్పు ఏముండదు. కనీసం ఈ ఒక్క విషయంలో నైనా నేను చెప్పినట్లు వినండి" అన్నారు రావుగారు.

"లేదండి రావుగారూ! బ్రతుకును సాఫీగా గడుపటానికి ఉపాధ్యాయ వృత్తితో వచ్చే ఆదాయం చాలని నా ఉద్దేశ్యం. నాకు పెద్ద కోరికలంటూ ఏమీ లేవు. సింపుల్‌గా బ్రతకడమంటేనే నాకిష్టం. నా ఆశయాల కనుగుణంగా మెదలుతూ ఉంటే చాలు నా భార్య. పైసా కట్నం లేకుండా సింపుల్‌గా రిజిష్టర్ మ్యారేజి చెయ్యండి. మీ అమ్మాయికి ఏం కష్టం కల్గించకుండా పూవుల్లో పెట్టి పూజిస్తాను. ఆమెకే బాధా లేకుండా జీవితం సాఫీగా సాగిపోవడం కంటే మీకేం కావాలి? నా షరతుల కొప్పుకుంటే మీ యిష్టమైన రోజున మ్యారేజి నిర్ణయించండి" అన్నాడు రఘు.

రఘుయొక్క ఆదర్శానికి శేఖర్ తన్మయుడయ్యాడు. డబ్బుకై సిగ్గువిడచి, పశువుకంటె హీనంగా అమ్ముడుబోతున్న నేటి యువతరంలో ఇలాంటి యువకులు అరుదుగా వుంటారు. ఆ యువకుడు తన చెల్లినే పెళ్ళిచేసుకుంటాననడం తన అదృష్టంగా భావించాడు శేఖర్. సాంప్రదాయాల పేరిట, మూర్ఖత్వంవల్ల తన నాన్న ఈ సంబంధాన్ని తిరస్కరిస్తాడేమోనని అతడు భయపడుతున్నాడు.

"నాన్నా! ఇందులో రఘుగారి షరతుల కొప్పుకోవడంలో అభ్యంతరమేమున్నది? ఒప్పుకొని ముహూర్తాలు నిర్ణయించండి" అన్నాడు శేఖర్.

[illegible] కాని తరతరాలుగా జీర్ణించుకున్న సాంప్రదాయం రామారావుగారిచే ఊఁ అనిపించలేదు.

“సరేలే బాబూ! ఆలోచించుకొని వారం రోజులలో తెలియజేస్తాను” అన్నారు రామారావుగారు.

“అలాగేనండీ మీ ఇష్టం” అన్నాడు రఘు.

రఘు, రాజాల అడ్రసులు తీసుకున్నారు రావుగారు.

ఇంటర్ వరకు చదివిన రాజేశ్వరికి సునిశిత పరిశీలనా శక్తి వుంది. రఘుయొక్క సత్ప్రవర్తనకు, వినయశీలతకు ఆమె ముగ్ధురాలయింది. ఇదివరకొచ్చిన యువకులంతా తనను ప్రాణం లేని బొమ్మలా చూశారేగాని, ఒక మనిషిగా లెక్కించలేదు. ఆమెకు రఘు అన్ని విధాలుగా నచ్చాడు. వాళ్ళకు బైటి గదిలో సంభాషణ జరుగుతున్నంతసేపు రాజేశ్వరి కలలు కంటూనే వున్నది. తన కాతనితో పెళ్ళి అయినట్లుగానే ఊహించుకొని పరవశించిపోతున్నది. మొదటి రాత్రి అతడామెను దగ్గరకు తీసికొన్నట్లుగా, తాను సిగ్గుదొంతరలో తేలిపోతున్నట్లుగా, అతడామెను బుజ్జగించి ముద్దుపెట్టుకొన్నట్లు ఊహిస్తూ సిగ్గుపడుతున్నది. ఆదర్శవంతుడైన ఆ యువకునితో సంసార జీవితాన్నూహించుకుంటూ గాలిమేడలు కడుతున్నది. ఊహల్లో తేలుతూ పరవశించిపోతున్న రాజేశ్వరి “అక్కా! వాళ్ళకు అన్నం వడ్డించాలట- అమ్మ రమ్మంటుందే!” అన్న పిలుపుతో ఈలోకంలోకి వచ్చిపడ్డది. రెండు గంటల క్రితం ఎంతో ముభావంగా, నిర్లిప్తంగా వున్న అక్క

ముఖంలో వెలుగును చూసి రమ ఆశ్చర్యపోయింది. అక్కకు సంతోషాన్ని కలుగజేసిన ఆ ఆగంతకుడు మంచివాడే అను కుంది. భోజనాలు ముగించుకొని రఘు, అతని మిత్రుడు వెళ్ళిపోయారు.

పెళ్ళిచూపులైన తెల్లవారి అంతా ఒకచోట వున్న సమయంలో లక్ష్మమ్మ రామారావుగారితో "ఏమండీ! ముహూ ర్తాలు పెట్టించక ఎందుకండీ నిన్న ఆలోచించి చెప్తామన్నారు? ఇద్దరూ ఇష్టపడింతర్వాత ఇంకెందుకండీ అభ్యంతరం" అన్నది.

ఆ మాటలకు రామారావుగారు గయ్‌మని లేచాడు. "నాకేనా పిల్లల బాగోగులంటే అవసరంలేనిది? ఆశయా లంటూ, ఆదర్శాలంటూ ముష్టి ఉపాధ్యాయ వృత్తితో పిల్లనేం సుఖపెడతాడు? పిల్లా పాపా కలిగితే ఉపాధ్యాయ వృత్తితో బిచ్చమెత్తుకొని పోషిస్తాడా? పైగా సింపుల్‌గా వుండాలట- నగలొద్దట, నాణ్యాలొద్దట. ఇన్ని నియమాలతో అది ఏం సుఖపడ్తుంది?" అన్నాడు కోపంగా.

"ఈ రోజుల్లో ఎవరు నాన్నా ఇవన్నిటికీ విలువనిచ్చేది? ఎలాగో పెళ్ళిచేస్తే సరిపోతుంది" అన్నాడు శేఖర్.

ఆ మాటలకు మరీ మండిపడ్డాడు రామారావు. "గడ్డొచ్చి తల్లిని వెక్కిరించినట్టు అంటరూ చెప్పేవాళ్ళే. దిక్కు నక్కి లేనివాళ్ళు, అలగాజనం చేసుకొన్నట్టుగా రిజిష్టర్ మ్యారేజి చేస్తే నా పరువు ప్రతిష్ఠ లేంకావాలి? రాజా వెలమ కులానికి చెందినవాళ్ళం మనం. కులంలో బంధువర్గంలో మనకెంత

తలవంపులు? వైభవోపేతంగా చేయాల్సిన పెళ్ళికాదని వంశ సాంప్రదాయాన్ని కాలదన్నాడని నన్నెత హేళన చేస్తారు?' కట్నాలు, లాంచనాలు లేకుండా పెళ్ళిచేస్తే ఖర్చుతప్పించు కోవడానికి ఇలాంటి పెళ్ళిచేసిండని ఎన్ని అపనిందలు అవమానాలు ఇన్ని విధాలుగా అవమానాల పాలయిన ఈ వెధవ సంబంధం చెయ్యకుంటేంది?'' అన్నాడు ఆవేశంగా

''అవునునాన్నా అయిదారేళ్ళనుంచి ఈ బంధువులంతా ఎక్కడ బోయారు? ఎన్నెన్నో సంబంధాలను చూస్తే కొందరు నల్లగా ఉందని, కొందరు ఇంకేవేవో వంకలు జెప్పి తిరస్కరించారు గదా. ఈ విధంగా ఇంకొన్నేళ్ళు పోతే దానికి పెళ్ళిలా అవుతుంది? అప్పుడు ఈ ఆచారాలు సాంప్రదాయాలు ఏం చేస్తాయి? అప్పుడు మీ కులం, బంధువులు మిమ్ముల‌ను ఆదుకోగలరా? అన్నాడు శేఖర్.

"ఒరే శేఖర్ నీవు నాకు చెప్పాల్సిందేం లేదు. నాకేం చేయాలో తెలుసు. నా కూతురు పెళ్ళిగాకుండా పడియున్నా ఫరవా లేదు కాని నేనీ దిక్కుమాలిన సంబంధాని కొప్పే కోను. అయినా తెలియక అడుగుతాను. **M A First Class** లో పాసయిన వాడు, కొద్ది, గొప్పా ఆస్తి పాస్తులున్న వాడు తనలో ఏలోపం లేకుంటే పైసా కట్నం లేకుండా పెద్దగా అందం లేకున్నా ఏంచూసి మన అమ్మాయిని పెండ్లి చేసు కుంటానంటున్నాడు? ఆదర్శాలు, ఆశయాలు ముసుగులో తనలోని లోపాన్ని కప్పి పుచ్చుకోవడానికి ఉపయోగిస్తు

న్నాడు. ఖచ్చితంగా అతనిలో ఏదో లోప ముండి యుంటుం ది. అతనికిచ్చినా కూతురు భవిష్యత్తునాశనం చేయలేను.'' అని వాళ్ళకు మాట్లాడడానికి అవకాశమివ్వకుండా లేచి పోయాడు.

తర తరాలుగా సంక్రమించిన కులదర్పం, అహంకారం మూర్ఖత్వం, అజ్ఞానం, సాంప్రదాయం, ఆచారాల పేరిట మూఢ విశ్వాసాలు ముగ్ధయైన రాజేశ్వరి ఊహలను నిర్దాక్షి ణ్యంగా నలిపి వేసాయి.

''తనలో ఏలోపం లేకుండా కేవలం ఆదర్శం పేరిట మీ మిత్రుడు, అందంగా లేకున్నా మా అమ్మాయిని కట్న కానుకల ప్రసక్తి లేకుండా పెళ్ళాడ్తానంటే నమ్మశక్యం గాకుండా ఉంది. ఈ సంబంధాన్ని చేసుకోవడానికి మేము సిద్ధంగా లేము. క్షమంచగలరు."

'రామారావు'

రాజా ఇచ్చిన ఉత్తరం చదివి తన ఆదర్శం తనకే ఎదురు తిరుగుతుందని ఊహించని రఘు నిశ్చేష్టుడయ్యాడు. తన ఆదర్శం తనకే ఎదురు తిరిగిందని విచారంతో దుఃఖం తో ఉన్న రఘు తెల్లవారి వచ్చిన లేఖ చూచి సంతోష సాగరంలో తేలియాడాడు.

రఘుగారికి

నమస్కారములు.

మీ ఆదర్శానికి ముగ్ధురాలనయ్యాను. మీరు అన్నిం

టికి పట్టుదలతో ఉండడం బాగాలేకున్నా మీ ఆదర్శం కొఱకై అన్నింటినీ వదలుకోవడం నాకు నచ్చింది. కుల మత సాంప్రదాయాల ఊబిలో కూరుకుపోయిన నాన్న గారికి మీరు నచ్చరని నాకు తెలుసు అందుకే సాహసించి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. మీకభ్యంతరం లేకుంటే మా వాళ్ళనెదిరించైనా నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మీకు నచ్చితే రిజిష్టర్ ఆఫీసులో పెళ్ళి ఏర్పట్లుచేసి నాకు తేదీని లేఖద్వారా మా మిత్రురాలింటికి తెలియ పరచండి. మనిద్దరం నిరభ్యంతరంగా పెళ్ళిచేసుకో వచ్చు. మీ లేఖకై ఎదిరి చూడగలను.

మీ కాబోయే భార్య

రాజేశ్వరి.

రఘు సంతోషంతో కలం అందుకున్నడు ఆమె ధైర్యాన్ని అభినందిస్తూ.

(రచ్చబండ జాతీయవార పత్రిక అక్టోబర్ 83 సంచికలల్లో ముద్రితం)

# 5. తల్లి ఋణం

రామయ్య తీవ్రంగా ఆలోంచిస్తున్నాడు. మనసుకళ పెళ కాగుతుంది. తనలో తానే ఏడుస్తున్నాడు. భరింపరాని దుఃఖ భారంతో మదన పడుతున్నాడు. ఒక దిక్కు కనిపెం చిన తల్లి, మరోదిక్కు దిక్కుమాలిన ఆర్థిక ఇబ్బందులు